# మాకున్న యోగ్యత ఏమిటని ?

కొండవలస పంచాయతీ స్కూలుకి బదిలీ చేశారనే వార్త విన గానే నా గుండె దడదడలాడింది. ఇంకా నిన్నకాక మొన్న పెళ్ళయిన ట్టుంది మాకు. ఏ ముచ్చటా తీరినట్టేలేదు. అప్పుడే ఎడబాటులా!

పెళ్ళినాడు ఏమని దీవిస్తారు పెద్దలు, 'మీరిద్దరూ ఎప్పుడూ విడిపో కుండా ఎల్లకాలం కలసి హాయిగా ఉండండి' అని కదా. కానివాళ్ళు చేసేది ఏమిటి, నేనేదో అన్నాననికాక మీ మటుకు మీరే ఆలోచించి చూడండి' ఆ క్షణంనుంచీ వెయ్యి వెయ్యిన్నొక్క విధాల ప్రయత్నిస్తారు, 'వాళ్ళని ఎలా విడదియ్యడమా' అని. ఆషాఢం అనీ, మూఢమనీ, శూన్యమాసంలో కాపరం పెట్టకూడదనీ, మంచిరోజు ఇప్పట్లోలేదనీ-ఇలాకొన్ని. చిన్నపిల్లా, యింతతొందరగా పంపేస్తే బెంగెట్టుకుంటుందనీ - తమ్ముడి ఒడుగో పెద్దక్క చిన్నకూతురు పెళ్ళో అయాక దిగబెడతామనీ ఇలా ఇంకొన్ని. పూజలో, నోములో, వ్రతాలో, మొక్కులో ఇలా ఇలా మరికొన్ని. ఏవైతేనేం పట్టపగలే పడగ్గది మీదకి దృష్టి మళ్ళే పడుచువాళ్ళకి బహుశా ఆ వయసు తమకు దాటిపోయిందనే ఏడుపుతో పెద్దవాళ్ళు కల్పించే ప్రతి బంధకాలు ఇవన్నీ. నాతో సరస్వతి 'తనుఃపూర్వకంగా' ఏకీభవించింది గనక చెప్పకేం మాదగ్గర యీ పెద్దవాళ్ళ పప్పులేం ఉడకలేదు. పెళ్ళ యిన యీ రెండేళ్ళయి ఒక్కరోజు ఎడబాటులేకుండా సంసారసుఖాన్ని కొల్లగొడుతున్నాం. ఉన్నట్టుండి ఇంత చిక్కువచ్చిపడుతుందని మా యిద్దర్లో ఎవరం నిద్దర్లో అయినా అనుకోలేదు.

సరస్వతి దేనికైనా రాజీపడుతుందిగాని ఇల్లు ఇరకటం అయితే మాత్రం ఆ యిల్లాలు వెంటనే మర్కటం అయిపోతుంది! అన్ని సదుపా

యాలూ ఉన్న వాళ్ళ తాతగారింట్లో ఆ హైదరాబాదు మహాపట్నంలో అతి గారాబంగా పెరిగిందిమరి. అందుకే నా శక్తికి మించిన అద్దె భరిస్తూ ఆ అందాలరాశి విందులు అందుకుంటున్నాను యిన్నాళ్ళూ. ఇప్పుడా కొండకోనల్లో మంచి యిల్లెక్కడ సృష్టించను! అసలక్కడ ఎలక్ట్రిసిటీ అయినా ఉందో లేదో!

మనసు బావురుమని ఏడిచింది. పొద్దుట మంచం మీంచి లేచే టప్పుడు ఓ పట్టాన మా సరస్వతి కౌగిలి విడి యివతలికి రాడానికే నా మనసు ఒప్పుకోదు. ఏకంగా ఆ సర్వశరీరాన్నీ తత్సంబంధమైన తీయని తలపుల్నీ అక్కడే తుడిచిపెట్టి నేనెక్కడికి వెళ్ళను, ఎలా పాఠాలు చెప్పను! 'మొత్తానికి నువ్వు అదృష్టవంతుడవోయ్ గోపీ!' అనే మా రైటరుగారి వ్యాఖ్యకి ఊచిపుచ్చుకు లెంపకాయ కొడదామన్నంత కోపం వచ్చింది. కాని పాపం ఆయన ఉద్దేశంవేరు.

'చిన్న స్కూలు. ఆట్టే వర్కు ఉండదు. అంత మారుమూలకి ఎవరూ వెళ్ళివుండరని చక్కని క్వార్టర్సుకూడా టీచర్సుకి ప్రొవైడ్ చేశా రని విన్నాను. వెంటనే రిలీవ్ అయిపోయి అక్కడికి పరిగెత్తి జాయినింగ్ రిపోర్ట్ యిచ్చేసి, ఓ క్వార్టర్స్‌కి తాళంవేసుకు వచ్చేస్తివా, యిక యింట్లో మీరెంత హోంవర్కు చేసుకున్నా అడిగేవాడుండడు' అని చెబుతున్న రైటరునోట్లో గుప్పెడు తియ్యబూందీ పొయ్యాలనిపించింది. వెంటనే కాంటీన్‌కి తీసికెళ్ళి క్వాలిటీ ఐస్‌క్రీమ్ ఇప్పించాననుకోండి. ఇక ఆ శుభ వార్త నేనూ సరస్వతీ ఎలా సెలిబ్రేట్ చేసుకున్నామో విడమర్చి చెబితే మీకు ఇష్టమేగనక, చెప్పిందాకా పూర్తిగావిని పీకలదాకా తిట్టిపోస్తారు. ఎందుకు మేష్టారూ పోజుకొడతారు. అంతటి భాగవతోత్తముడయిన ఆ పోతనకే-

"ఆ హేమంతపు రాకకు
శ్రీహరి ఒక్కింత వణికి చింతింపంగా
ఓహో వెరవకుమని శ్రీ
ఆ హరికిని తనకుచంబు లభయంబిచ్చెన్"

అనే శృంగార వర్ణన తప్పలేదే! పడుచువాళ్ళం. మా బాధలు మా కుండవా!

"కొండవలస నీకు కోటి దండాలు" అనుకుంటూ ఎంతో ఆడుతూ పాడుతూ వెళ్ళి ఉద్యోగంలో చేరేనా, తీరా చూస్తే అక్కడ గుండె రాయి అయ్యే పరిస్థితి ఏర్పడింది. "కొండవలస నీకు గోడకుర్చీలు" అని తిట్టుకున్నాను.

కాని ఏంచేస్తే ఏం లాభం, కల కల్ల అని తెలిశాక !

అక్కడ వున్నవి హెడ్మాస్టరుది కాక రెండే రెండు క్వార్టర్సు. ఓ దాన్లో ఎప్పట్నుంచో ఓ సీనియర్ టీచరు ఉంటున్నాడట. రెండోది ఆ ఉదయమే చేరిన రాంజీ అనే లెక్కల మేష్టరు ఆక్యుపై చేశాడుట. వీడికి వెంటనే ఆక్యుపంచరు చెయ్యా! ఇంతాచేస్తే ఆ గాడిదకి ఇంకా పెళ్ళాం అంటే ఏమిటో తెలీదుట. అదలా ఉంచి ఆ వెధవ నాకంటే ఆర్నెల్లు జూనియర్‌ట. ఆ సంగతి తెలీగానే హెడ్మాస్టరు మీద రంయ్‌మని ఒంటికాలిమీద లేచాను. "అలా మీరు నోరుపారేసుకోడం తొందరపాటు. ఇక్కడ మేం చూసేది స్టేషను సిన్సియారిటీ మాత్రమే" అని ఒక్క ముక్కలో జవాబు చెప్పి అటు తిరిగిపోయాడు. అప్పట్నుంచీ ఆ గంట్ల మొహం హెడ్మాస్టరంటే ఒళ్ళుమంట.

ఆ స్కూల్లో నే చెప్పినవాళ్ళుకాక మరో నలుగురు టీచర్లున్నారు. అందులో రుబ్బురోలు లాంటి ఒకాయన ఆ తిరగలి గంట్లకి దూరపు బంధువట. అది సహజమేగదా! వాళ్ళింట్లో పేయింగ్ గెస్టుగా ఉంటున్నాడు. ఇక మిగిలిన ముగ్గురూ మూడుకోసుల దూరంలో ఉన్న గొల్లపల్లి అగ్రహారంలో కాపరాలు ఉంటూ, పొద్దుటే భోజనాలుచేసి సైకిళ్ళ మీదవచ్చి సాయంకాలాలు యిళ్ళకు వెడతారు. పోనీ ఈ కె. వలసతో పోలిస్తే ఆ జి. కె. అగ్రహారం పెద్దదేమో అనుకుంటే ఓ పాతజోకు గుర్తొస్తుంది. మీరు వినకపోయినా అదిక్కడ ఉటంకించక మానను.

అది ఓ పెళ్ళి చూపుల ఏర్పాటు. ఓ అమ్మాయి చకచకా నడిచి వచ్చేస్తుంటే ఆ తొందరపాటు పెళ్ళికొడుకు 'ఇదేమిటి పెళ్ళికూతురికి అప్పుడే జుత్తు పండిపోయినట్టుందే!' అంటే, 'ఈవిడ పెళ్ళికూతురని ఎవరు చెప్పారు....' అని మధ్యవర్తి అనగానే గుండె రాసుకున్నాట్ట ఆ సోగ్గాడు. '...పూర్తిగా చెప్పనివ్వండి. ఈవిడ పెళ్ళికూతురి చెల్లెలు.

పెళ్ళికూతురికయితే రెప్పలే పండిపోయాయిమరి!' సోగ్గాడు సొమ్మ సిల్లాడనే సౌదెందుకుగాని అంతటి సుందరి యీ అగ్రహారం!

ఇంకా ఆ కె. వలసలో రాజకీయ నాటకంలో ఓ రంగంగా కొన్ని సిమెంటు కట్టడాలయినా కనిపిస్తున్నాయి. ఇక జి.పి. అగ్రహారంలో ఏమున్నాయి, మట్టి యిళ్ళూ పూరిపాకలూ తప్ప! మీరు ఏ వేళ వెళ్ళి చూడండి! 'చేత దొడ్డిచెంబు చెవిలోన పొగచుట్ట' మనుషుల దర్శనభాగ్యం నుంచి తప్పించుకోలేరు!

ఇదివరకు నేను పనిచేసిన ఊళ్ళో ఉన్నంతలో అన్ని హంగులూ ఉన్న ఇల్లు అద్దెకు తీసుకుని గ్యాస్ స్టవ్వూ, కుక్కరూ, మిక్శ్చరూలాంటివి అమర్చినా 'టీవీ, ఫ్రిజ్ లేని యిల్లు అదీ ఓ యిల్లేనా?' అనేది సరస్వతి. 'రోజుకో ప్రేమ సీమ విహరిస్తున్నాం. దాని ముందు టీవీ తీసికట్టు. చల్లని ఈ శృంగార హేల ఎగుట ఎలాంటి ఫ్రిజ్జి అయినా దిగదుడుపే కదా!' అంటూ మరి మాటాడకుండా మీదకి బలంగా లాక్కునేవాణ్ణి.

ఇక్కడెలా సర్ది చెప్పను! లెట్రిన్‌లేని కొంపలో వుండేకన్నా ఎండ్రిన్ తాగి చస్తే మంచిదంటుంది. వాళ్ళ తాతగారి ఊరు హైద్రాబాద్ దిగబెట్టి వచ్చేశాను. అంతకంటె ఏంచెయ్యను. దుర్భరమైన, నాతిగల బ్రహ్మచర్యము, ఆ నాలుగు తలలవాడు ఈ నాలుగు కళ్ళవాడికి రాసి పెట్టాక చింపాంజీలాంటి ఆ రాంజీగాడిని ఓసారి కలుసుకుని నా అవస్థ చెప్పుకుంటేనో అనిపించింది గాని వాడిక్కడ ఉండిచస్తేనా! కొత్తగా వచ్చాడు గనక వాడి గురించి ఎవడికీ సరిగ్గా తెలీదు. అది గాక పది మాటలకి ఒకమాట బదులిచ్చే రకం అది. చూపులకి కుర్రాడిలాగే కనిపిస్తాడు గాని ఎందుకో ఎప్పుడూ ఏడుస్తున్నట్టే ఉంటుంది ఆ మొహం. అతను ఆ అగ్రహారంలో అయినా ఉంటున్నట్టులేదు, ఏదో వేళకి స్కూటరుమీద వడగాలిలా వచ్చిపడతాడు. ఇలా క్లాసులో పాఠాలు అయిపోతాయో లేదో అక్కణ్ణుంచే సుడిగాలిలా దూసుకుపోతాడు.

అన్నట్లు మీకు చెప్పనేలేదు కాబోలు స్టోర్‌రూంలో ఓ పక్క నేనెలాగో గడుపుకుని కాలక్షేపం చేస్తున్నాను. అక్కణ్ణుంచి కిటికీ తీసి చూస్తే నాకు రావలసిన క్వార్టర్సు పీధిగుమ్మం తాళం కనిపిస్తుంది నాకు.

గడ్డివాము దగ్గర కాట్లకుక్కలా ఆ మహానుభావుడు తను ఉండడు, ఆ క్వార్టర్సు నాకు యివ్వడు!

నెలలకి నెలలే గడుస్తున్నాయి. వెన్నెలలన్నీ వెలవెలలే అవుతున్నాయి. బుగ్గలు పీక్కుపోతున్నాయి. కనుగుడ్లు ముందుకు పొడుచుకువస్తున్నాయి. ఒక్కరోజు గెడ్డంగీసుకోకపోవడం మాట అలా వుంచి, గీసుకుని ఆఫ్టర్ షేవ్ లోషన్ రాసుకోకపోతే సరస్వతి దరిదాపులకి రానిచ్చేది కాదు! ఇప్పుడెంత గెడ్డం పెరిగితే ఎవడిక్కావాలి! గుచ్చుకుంటే గుచ్చుకోనీ అని కాదు, చచ్చిపోతే చచ్చిపోనీ అనిపిస్తోంది సరస్వతిలేని బతుకు ఊహించుకుంటే.

అవును, నోటికి ముద్దవెళ్ళటంలేదు. కంటికి నిద్దురావడంలేదు. నిజంగా యిన్నాళ్ళు ఎలా నెట్టుకొచ్చానో అదే ఆశ్చర్యం. ఆ రోజుల్లో మాత్రం కన్ను మూసినా తెరిచినా అదే ధ్యాస. పాఠాలు చెబుతున్నా, గోళ్ళుగిల్లుకుంటూ కూచున్నా అదే, అదే ఊహ. కనబడిన కాగితం తీసుకుని సరస్వతి రూపానికి సంబంధించిన బొమ్మో, పాటో, ఉత్తరం లాంటిదో, మరేదో చెప్పకూడనిదో, బరికేవాణ్ణి. పూర్తి అయాక పూర్తిగా చింపేసేవాణ్ణి. అసలు మనిషి దూరమయాక నకలు నగిషి నాకెందుకు!

సాటివయసు మగవాడు. అనుభవం లేకపోవచ్చుగాని అహరహం విరహమనేది అదెంత బాధాకరమో ఊహించలేని వయసు కాదుగా! ఓ రోజు రాంజీ స్కూటర్ని బలవంతాన ఆపాను. సిగ్గు విడిచి నాగోడు వివరించుకున్నాను. మనిషయితేకదా, 'సారీ బ్రదర్' అంటూ మరింత స్పీడుతో ముందుకి లాగించేశాడు.

అయితే నిమిషాలమీద ఈలవేస్తూ గెడ్డం నున్నగా గొరిగించుకుని, ఆఫ్టర్ షేవ్‌లోషన్ పట్టించుకునే రోజు అంత దగ్గర్లోనే ఉందని ఆ క్షణం నేను ఊహించనైనా లేదు! ట్రాన్స్ఫర్ ఆర్డరు అందడమేకాదు, రాంజీ నిమిషాలమీద ఆ క్వార్టర్స్ నాకు హాండోవర్ చేశాడు! శరవేగంతో వెళ్ళి ఆ శరన్మేఘాన్ని తరలించుకురావాలని శలవుకి అప్లై చేశాను. ఇన్నాళ్ళ బరువూ ఈ ఒక్క క్షణంలో తీరిపోయినట్టయింది. ఆ రాకాచంద్రికని ఎప్పుడు చూస్తాను. ఆ బాకీ ప్రణయాన్ని చక్రవడ్డీతోసహా ఎప్పుడు తీర్చ

కుంటాను. ఇప్పుడు నా అణువణువూ పెడుతున్న తీయనిరాద యిదే, యిదే!

రేపే ప్రయాణం అనగా ఆ రాత్రి హెడ్మాస్టరు నోటివెంట రాంజీ అసలు సంగతి విన్నాను. శలవు చీటీ యిద్దామని వెళ్ళేసరికి అతని కబురే వినపడుతోంది.

'రాంజీ చిత్రమైన, లోతైన మనిషి. తన కష్టాలు తనే భరించాలను కుంటాడుగాని రెండో కంటికి తెలిసినా ఎంతో బాధపడేరకం. అందుకే ఇన్నాళ్ళూ దాచిపెట్టేను. ఇక దాచడం అనవసరం.'

అంటూ నా చేతిలో కాగితం అందుకుని యిలా చెప్పుకొచ్చాడు.

"రాంజీకి నా అనేవాళ్ళు ఎవరూ లేరు, పెంచి పెద్దచేసిన ఓ ముసలితాత తప్ప. తల్లీదండ్రీ చిన్నప్పుడే పోయిన రాంజీని చేరదీయడమే కాక తన భూమి పుట్రా అమ్మి గ్రాడ్యుయేట్ చేసిన ఆ తాత అంటే రాంజీకి సహజంగా పంచప్రాణాలూను. ఈమధ్య ఆయనకి కుదరని గుండెజబ్బు పట్టుకుంది. ఈ ప్రాంతాలలో మన కొండవలస ఎత్తైన స్థలం. ఇక్కడికి తాతని తీసుకొచ్చి మంచి మందులిచ్చి సేవచేస్తే ఈ కొండ గాలికి ఆరోగ్యం మళ్ళుతుందనే రాంజీ ఉద్దేశం. అందుకే ఇన్నాళ్ళూ లాక్ చేసి ఆ క్వార్టర్సుకి అద్దె చెల్లించాడు. ఏ పరిస్థితుల్లో అయినా పుట్టిన ఊరు దాటననే మొండి ఘటం ఆ ముసిలాయన. తాతకి నచ్చచెప్పి తీసుకు రాలేకపోలేనా అనే రాంజీ కోరిక అలాగే ఉండిపోయింది. జబ్బు ముదిరి తాత దినం మాత్రం తీరిపోయింది. ఇక అతనికి ఎక్కడికి బదిలీ అయినా ఒకటే!

ఆ విషాద గాథా, రాంజీ త్యాగగుణం వింటూంటె ఎంతో సిగ్గు అనిపించింది. కనువిప్పు అయింది. నా ఉత్సాహమంతా ఎందుకో నాకే ఎబ్బెట్టుగా తోచింది. అయితే అంతకన్న మంచి పాఠం ఇంకాముందే ఉందని నేనెరగను!

మరునాటి ఉదయం అది.

ఆ స్కూలు పిల్లలు రాంజీకి వీడ్కోలు చెబున్న దృశ్యం అది.

ఈసారి అతని స్కూటరులో ఆ హడావిడి లేదు. ఎందుకో తప్పు చేసినట్టు అతను మొహం దించుకుని ఉన్నాడు. పిల్లలు మాత్రం అతన్ని

వదలడంలేదు. ఏభైమంది దాకా ఉంటారేమో, గేటుదాకా వెళ్ళి, కనుమరుగయేదాకా కన్నీటితో అతనికి చెయ్యి ఊపుతున్నారు.

అంతేకాదు. దీనమైన మొహాలతో తిరిగి వస్తూ అక్కడి చెట్టుకింద తచ్చాడుతున్న నా చుట్టూ చేరారు.

'సార్, మీరూ మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోరుగా!' అన్నారు. నా గుండె కలుక్కుమంది. ప్రేమపూరితమైన ఆ పలకరింపు నా అంతరాంతరాలలో ఎక్కడో చురుక్కుమనిపించింది. మేమెవరమో మా తప్పేమిటో నిలదీసి అడిగినట్టయింది.

ఎంతటి నిష్కల్మషం ఈ పిల్లల హృదయం!

రాంజీకెప్పుడూ తన తాత ఆరోగ్యం మీద దృష్టి.

నాకెప్పుడూ మా సరస్వతి సాహచర్యం మీద ధ్యాస.

మా దృష్టికేంద్రాలలో మంచీ చెడూ ఉంటే అది వేరే విషయం గాని మేం ఇద్దరం స్వార్థపరులమే. ఎందుకొచ్చామో ఆ పని చెయ్యలేదు. ఒక్కనాడు పాఠాలు తిన్నగా చెప్పిచావలేదు. అయినా ఈ ప్రేమమూర్తులకు మాలో మసకలు కనపడలేదు. మాలో ఇంకా మంచి మాత్రమే కనిపిస్తోంది వీళ్ళకి. కన్నీటితో వీడ్కోలు చెప్పడానికైనా, సాదరంగా ఆహ్వానించడానికైనా వీళ్ళెప్పటికీ సిద్ధంగానే ఉన్నారు! ఈ కొండజాతి నిండు హృదయులకి మా నాగరికులం ఏం చెప్పగలమని!